# నమస్తే తెలంగాణ
## ఖమ్మం
5 | ఖమ్మం, గురువారం 11 జూలై 2024 | KHAMMAM




భద్రాచలం : తహసీల్‌లో వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు మానె రామకృష్ణ



చర్ల : చర్ల తహసీల్ ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

# సార్ల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



ధర్నా చేసేందుకు పాఠశాల నుంచి వస్తున్న విద్యార్థులు

- తల్లిదండ్రులు, గ్రామస్తులతో కలిసి ఆందోళన
- పది తరగతులకు బోధించేది ఇద్దరు టీచర్లే..
- ఆగ్రహంతో పాఠశాలకు తాళం వేసిన విద్యార్థి తండ్రి
- డీఈవో హామీతో ఆందోళన విరమించిన విద్యార్థులు

అశ్వారావుపేట రూరల్, జూలై 10 : ఇద్దరు ఉపాధ్యాయులు 200 మందికి ఎలా బోధిస్తారంటూ ఆగ్రహించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి హైస్కూల్‌కు తాళం వేశారు. అనంతరం వేలేరుపాడు-అశ్వారావుపేట ప్రధాన రహదారిపై బుధవారం మూడు గంటలపాటు ధర్నా చేశారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఇంతవరకు ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయలేదని, ఇక తమ చదువులు ఎలా సాగుతాయని విద్యార్థులు.. ప్రజాప్రతినిధులు, అధికారులకు గతంలో ఫిర్యాదు చేశారు. అయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో విద్యార్థులు వారి తల్లిదండులు, యువకులు, గ్రామ పెద్దలతో కలిసి ప్రధాన రహదారిపై బైఠాయించారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలతో భవనాలు నిర్మించినా.. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఉపాధ్యాయులు లేకపోవడంతో బోధన ఎలా సాగుతుందని పలువురు ప్రశ్నించారు. 'వీ వాంట్ టీచర్స్' అంటూ విద్యార్థులు ప్లకార్డులు చేత పట్టుకుని నినాదాలు చేశారు. విద్యాశాఖ అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు కదిలేది లేదని భీష్మించారు. పోలీసులు పలుమార్లు విద్యార్థులు, తల్లిదండ్రులకు నచ్చజెప్పినా వినలేదు. దీంతో డీఈవో వెంకటేశ్వరాచారి ఫోన్‌లో గ్రామస్తులతో మాట్లాడుతూ.. 3 రోజుల్లో ఉపాధ్యాయులను నియమిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. హామీని విస్మరిస్తే వారం రోజులపాటు ఆందోళనలు చేపడుతామని వారు హెచ్చరించారు.

### విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు: మాజీ ఎమ్మెల్యే మెచ్చా

అశ్వారావుపేట రూరల్/ అశ్వారావుపేట టౌన్, జూలై 10 : ఉపాధ్యాయులు లేకుండా పాఠశాలలో విద్యాబోధన ఎలా సాగుతుందని, విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకోవద్దని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు విద్యాశాఖ అధికారులను హెచ్చరించారు. బుధవారం గుమ్మడవల్లి గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు గుమ్మడపల్లి హైస్కూల్ పరిస్థితి గురించి మెచ్చా దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 రోజులు గడిచినా ఉపాధ్యాయులను నియమించకపోవడం విడ్డూరంగా ఉందని, ఇదేనా కాంగ్రెస్ పాలన అని ఆయన మండిపడ్డారు. వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

# డీఎస్సీ వాయిదా వేయాల్సిందే..

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న డీఎస్సీ పరీక్షలను మూడు నెలలపాటు వాయిదా వేయాలని కోరుతూ బీఆర్ఎస్, బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, చర్ల, అన్నపురెడ్డిపల్లి, దమ్మపేట, చండ్రుగొండ, భద్రాచలం మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట బుధవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అశ్వారావుపేటలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం మొండివైఖరి వీడి నిరుద్యోగ అభ్యర్థుల అభ్యర్థనను పట్టించుకోవాలని, డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులను పెంచాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కావాలనే పరీక్షలను వెంటవెంటనే జరిపించేందుకు సిద్ధపడుతున్నారని విమర్శించారు. నిరుద్యోగుల పోరాటానికి సంఘీభావంగా నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశ్, నాయకులు సత్యవరపు సంపూర్ణ, నారం రాజశేఖర్, భద్రాచలం నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి మానె రామకృష్ణ, ఆకోజు సునీల్‌కుమార్, గాజుబోయిన ఏసు, యార్లగడ్డ శ్రీను, పానుగంటి లోకేశ్, సంకుబాపన అనుదీప్, బొమ్మిడి శ్రీకాంత్‌యాదవ్, ముత్యాల రాజేశ్, కొట్టి వెంకటేశ్వర్లు, కోరెం చంద్రశేఖర్, తాడూరి రజాక్, చిప్పనపల్లి బజారయ్య తదితరులు పాల్గొన్నారు.

–నమస్తే నెట్‌వర్క్

- బీఆర్ఎస్, యువజన విభాగం ఆధ్వర్యంలో.. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా, నిరసనలు
- ప్రభుత్వ కార్యాలయాల్లో వినతులు సమర్పించిన నాయకులు



లక్ష్మీదేవిపల్లి : వినతిపత్రం సమర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



అశ్వారావుపేట టౌన్ : తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



చండ్రుగొండ : వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



అన్నపురెడ్డిపల్లిలో..



చుంచుపల్లి : నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



దమ్మపేట : తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ యువజన విభాగం శ్రేణులు

# ఆరు నెలలుగా వేతనాల్లేవు మహాప్రభో..

## కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీల కార్మికుల ధర్నా




కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీల కార్మికులు

రఘునాథపాలెం, జూలై 10: పల్లెలను పరిశుభ్రంగా ఉంచే గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం అలసత్వం వహించింది. దీంతో ఆగ్రహించిన కార్మికులు రోడ్డెక్కారు. ఆరు నెలలుగా తమకు వేతనాలు చెల్లించడం లేదంటూ ఆందోళనబాట పట్టారు. ఈ మేరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వర్కర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పంచాయతీ కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న రోజుల్లో నిరవధిక దీక్ష చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. సంఘం బాధ్యులు సింగు నర్సింహారావు, గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, నరేందర్ రెడ్డి, రాందాస్, రాజగోపాల్, మంగీలాల్, కృష్ణారెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

**ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు సాబీర్‌పాషా**

కొత్తగూడెం సింగరేణి, జూలై 10 : బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు, విపక్ష పార్టీలు చేపట్టిన దశలవారీ ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం హెడ్డాఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. బొగ్గు బ్లాకుల వేలంపై కేంద్రం నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు సాబీర్‌పాషా మాట్లాడుతూ బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ నిర్ణయం తెలంగాణలోని సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే కుట్రల్లో భాగమేనన్నారు. తెలంగాణలోని బొగ్గు గనులను ప్రైవేటీకరిస్తే సింగరేణి ప్రాంతాలకు మనుగడ ఉండదన్నారు. కార్మికుల హక్కులు హరించుకపోవడంతోపాటు తొలగింపు ప్రక్రియను వేగవంతం చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం నిర్ణయంతో సింగరేణి కార్మికులు ఆందోళనకు గురవుతున్నారని, వారికి కోల్‌బెల్ట్ ప్రాంతాల ఎమ్మెల్యేలు, ఎంపీలు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వేలం ప్రక్రియను నిలిపివేయకుంటే కోల్‌బెల్ట్ ప్రాంతాలను స్తంభింపజేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నరాటి ప్రసాద్, ఇజ్జగిరి శ్రీనివాస్, దమ్మాలపాటి శేషయ్య, యాకూబ్ షావలి, జాటోత్ కృష్ణ, వీరన్న తదితరులు పాల్గొన్నారు.




కొత్తగూడెంలో హెడ్డాఫీసు ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

# అసెంబ్లీ సమావేశాల తరువాతే 'రైతుభరోసా'

- రైతులు, ప్రజల అభిప్రాయాల కోసమే ఉమ్మడి జిల్లాల్లో సమావేశాలు
- ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు పంటల సాయం నిలుపుదల
- రియల్ ఎస్టేట్ భూములు, సాగుకు పనికిరాని భూములకు బంద్
- 'రైతుభరోసా' రాష్ట్ర క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి
- రైతులకు పూర్తి న్యాయం చేయాలన్నదే లక్ష్యం: తుమ్మల, పొంగులేటి
- 'రైతుభరోసా'పై ఖమ్మంలో ఉమ్మడి జిల్లా విస్తృతస్థాయి సమావేశం

మామిళ్లగూడెం, జూలై 10 : రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాతే పూర్తిస్థాయి మార్గదర్శకాలు రూపొందించి 'రైతుభరోసా' పథకాన్ని అమలు చేస్తామని రైతుభరోసా పథకం రాష్ట్ర క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు పంటల సాయం నిలుపుదల చేయాలని, రియల్ ఎస్టేట్ భూములు, సాగుకు పనికిరాని భూములకు కూడా పంటల పెట్టుబడి సాయాన్ని బంద్ పెట్టాలని రైతులు, ప్రజల నుంచి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. అయితే ఈ పథకం అమలులో రైతులు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకే ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా విస్తృతస్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. కాగా, ఇందులో భాగంగా సబ్ కమిటీ చైర్మన్ అయిన డిప్యూటీ సీఎం భట్టి, సభ్యులైన మంత్రులు తుమ్మల, పొంగులేటి కలిసి ఖమ్మం కలెక్టరేట్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. రైతులు, శాస్త్రవేత్తలు, డాక్టర్లు, లాయర్లు, జర్నలిస్టులు సహా వివిధ వర్గాల వారిని సమావేశపరిచి రైతుభరోసా అమలుకు అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు.

### రైతులు, ప్రజల అభిప్రాయాల మేరకు విధివిధానాలు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రైతులకు పంటల పెట్టుబడి సాయం కింద రైతుభరోసా ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చామన్నారు. ఆ హామీ అమలుకు తమ ప్రభుత్వం దృఢసంకల్పంతో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చే నిధులను దృష్టిలో పెట్టుకొని త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుందని తెలిపారు. అలాగే రాష్ట్ర పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలోనే రైతుభరోసా అమలుపై విధివిధానాల రూపకల్పన చేస్తామన్నారు. ఇందుకోసమే తమ ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని నియమించినట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి.. ప్రజలు, రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి విధివిధానాలు రూపొందించాలని నిర్ణయించినట్లు తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు

### అర్హులకే రైతుభరోసా: తుమ్మల

క్యాబినెట్ సభ కమిటీ సభ్యుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నిజమైన రైతులకే రైతుభరోసా అందించేందుకు అన్ని వర్గాల ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల ఆలోచనల మేరకు అర్హులైన చిన్న, సన్నకారు రైతులకు రైతుభరోసా అందిస్తామన్నారు.

### నిజమైన రైతులను ఆదుకుంటాం: పొంగులేటి

క్యాబినెట్ సబ్ కమిటీ మరో సభ్యుడు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. నిజమైన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. మరో తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లోనూ ప్రజల అభిప్రాయాలు సేకరిస్తామన్నారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు.

### అభిప్రాయాలు తెలిపిన ఆయా వర్గాల ప్రజలు

అనంతరం, రైతుభరోసాపై ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రైతులు, రైతు సంఘాల నాయకులు, కౌలు రైతులు, వైద్యులు, న్యాయవాదులు, పాత్రికేయులు, శాస్త్రవేత్తలు, మరికొన్ని వర్గాల ప్రజలు తమ తమ అభిప్రాయాలను ఈ సమావేశంలో వ్యక్తం చేశారు. సాగుభూమికే భరోసా అందజేయాలని, చిన్న సన్నకారు రైతులకు న్యాయం చేయాలని, ఆదాయపు పన్ను చెల్లింపుదారులను తొలగించాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో పట్టాలేని రైతులకు పంటల సాయం అందించాలని, అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలని, కౌలు రైతులకు బోనస్, పట్టా రైతులకు రైతుభరోసా అందించాలని, కౌలు రైతుల గురించి ఆలోచించాలని పేర్కొంటూ వారు తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమాశంలో ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు రఘురాంరెడ్డి, బలరాంనాయక్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కే.రామకృష్ణారావు, ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు ముజమ్మిల్ ఖాన్, జితేశ్, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్ నాయక్, తెల్లం వెంకట్రావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల వ్యవసాయ అధికారులు విజయ నిర్మల, బాబూరావు, అధికారులు, రైతులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

















